## క్లుప్తంగా

### బీపీఎస్ మేళాకు స్పందన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో బుధవారం నిర్వహించిన బీపీఎస్, ఎల్ఆర్ఎస్ మేళాకు స్పందన వచ్చింది. ఏసీపీ మురళీగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... ఎల్ఆర్ఎస్ 324కు గాను 126 దరఖాస్తులు ఆమోదించారు. ఫీజులు కట్టమని 118 అర్జీలకు అంగీకరించారు. బీపీఎస్ కింద 294 కు గాను ఫీజులు కట్టమని ఆమోదించినవి 14 ఉన్నాయి. సీఆర్డీఏ నుంచి పలు దరఖాస్తులు తాడిగడప మున్సిపాలిటీకి బదిలీ అయ్యాయన్నారు. ఏసీపీ వీవీ సుబ్బారావు, టీపీఎస్ ఎన్.గిరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



అల్లాపురం(గన్నవరం):మండలంలోని అల్లాపురం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ డొక్కు సాంబశివం కన్నబాబు చేతుల మీదుగా వంద లీటర్ల మజ్జిగను సరఫరా చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఎండలను దృష్టిలో పెట్టుకుని ఉపాధి కూలీలకు తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ద్వారా కూలీలకు మజ్జిగ పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. ఉప సర్పంచి అవుటపల్లి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నేతలు బలుసుపాటి సురేష్, చొప్పవరపు బాలశౌరి, ఆరేపల్లి నాగశంకర్, వార్డు సభ్యులు అచ్చయ్య, మరియదాసు, రాము తదితరులు పాల్గొన్నారు.

### సిబ్బంది సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

డీఆర్ఎం షివేంద్రమోహన్



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): రైల్వే సిబ్బంది సంక్షేమానికి విజయవాడ డివిజన్ అధిక ప్రాధాన్యమిస్తోందని డీఆర్ఎం షివేంద్రమోహన్ పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని ఈటీటీసీ (ఎలక్ట్రిక్ ట్రాక్షన్ ట్రైనింగ్ సెంటర్)లో ఆధునీకరించిన కిచెన్, డైనింగ్ హాల్, వాకింగ్ ట్రాక్‌లను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణపురంలోని ఈటీటీసీ సెంటర్‌లో దక్షిణ మధ్య రైల్వేతోపాటు ఇతర జోన్లలోని రన్నింగ్, టీఆర్ఎస్, ఈఎయూ, టీఆర్‌డీ సిబ్బందికి వివిధ విభాగాల్లో శిక్షణ ఇస్తారన్నారు. 2007 నుంచి ఇక్కడ 3–ఫేజ్ లోకోమోటివ్‌లపై కూడా లోకో పైలెట్లకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సెంటర్ నుంచి ఏడాదికి 7వేల మంది లోకోపైలట్‌లు శిక్షణ పొందుతారని తెలిపారు. శిక్షణ కాలంలో వారి కోసం హాస్టల్, క్యాంటిన్ సదుపాయాలు అందిస్తున్నట్లు తెలిపారు. వారికి మరిన్ని సౌకర్యాలు అందించడానికి రూ. 30 లక్షలతో క్యాంటిన్, డైనింగ్ హాల్‌తో పాటు 2,600 మీటర్ల పొడవైన వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు డి.శ్రీనివాసరావు, ఎం.శ్రీకాంత్, సీనియర్ డీఈఈ కొండా శ్రీనివాసరావు, ఆర్‌సీ సాహు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### యూపీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): నగర పరిధిలోని చిట్టినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆమె బుధవారం సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ నరసింహ నాయక్‌తో కలిసి యూపీహెచ్‌సీని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ అందుతున్న సేవలను పరిశీలించారు. అవుట్ పేషెంట్ సేవలు, రక్తపరీక్షల నిర్వహణ, మందుల అందుబాటు, రికార్డులు పరిశీలించారు. మే నెలకు సంబంధించి 534 మంది అవుట్ పేషెంట్లను పరీక్షించగా, ప్రత్యేక ఓపీలో 90 మందిని పరీక్షించినట్లు రికార్డులు ఉన్నాయి. ఈహెచ్ఆర్ నమోదు 523 కాగా, ఈ సంజీవని 168 రికార్డులు అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ సుహాసిని తెలిపారు. ఇక్కడ ఓపీ సేవలతో పాటు, నిర్దేశిత రక్తపరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ సుహాసిని తెలిపారు. రోజూ క్రమం తప్పకుండా ఓపీ, రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు, మందులకు ఎలాంటి కొరత లేదని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మెరుగైన సేవలు అందిస్తున్నామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. ఇక్కడ లాస్ట్ గ్రేడ్ సర్వీస్ పోస్టు ఖాళీగా ఉందని, దాని భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

**అవాస్తవాలు రాయొద్దు**

చిట్టినగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, అన్ని రకాల పరీక్షలు చేస్తుండగా, ఒక పత్రికలో వాస్తవ విరుద్ధమైన, సత్యదూరమైన కల్పిత కథనాలు రాయడాన్ని ఆమె ఖండించారు.వాస్తవాలు మరిచి కథనాలు రాయడం మంచిది కాదని హితవు పలికారు.

# గ్రామ సచివాలయ వలంటీర్ల సేవలు ప్రశంసనీయం



దావాజిగూడెంలో వలంటీర్లను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు



అవార్డు అందుకున్న వలంటీర్లతో ఎమ్మెల్యే వంశీ

గన్నవరం: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ అనగాని రవి అన్నారు. మండలంలోని దావాజీగూడెం గ్రామ సచివాలయం–1లో బుధవారం వలంటీర్లను సత్కరించి పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయడంలో వలంటీర్లు, సచివాలయ వ్యవస్థలు కీలకపాత్ర వహిస్తున్నాయని చెప్పారు. సేవా భావంతో పనిచేస్తున్న వలంటీర్లను మరింత ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పురస్కారాలను అందజేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య, సర్పంచి బడుగు బాలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు రెడ్డి సరోజిని, ఈవో సత్యబాబు తదితరులు పాల్గొన్నారు.

**అజ్జంపూడిలో...**

మండలంలోని అజ్జంపూడి సచివాలయంలో ఏడుగురు వలంటీర్లను జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, సర్పంచ్‌లు కంచర్ల చిన్నా, పేరం సుబ్బారావు దుశ్శాలువాలతో సత్కరించి పురస్కారాలను అందజేశారు. పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**వలంటీర్లు సమర్థంగా పని చేయాలి**

ఉంగుటూరు: వలంటీర్లు తమకు కేటాయించిన విధులు సమర్థంగా నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ అన్నారు. వెల్దిపాడు, ఉంగుటూరు సచివాలయాల వలంటీర్లకు బుధవారం సేవా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వలంటీర్ల పాత్ర కీలకమైనదని చెప్పారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందజేసి వలంటీర్లు అందరి మన్ననలను పొందుతున్నారని ప్రశంసించారు. ఉంగుటూరులో 20, వెల్దిపాడులో 19మందికి సేవా మిత్ర అవార్డులను అందజేశారు. మండలంలో ఎంపికైన నలుగురు సేవా రత్న వలంటీర్లను బ్యాడ్జి, మెడల్, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వి.సరోజిని, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, సర్పంచ్ వరప్రసాద్, ఎంపీడీవో శేషగిరిరావు, ఈవో ఆర్డీ బాషా, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

**వలంటీర్లకు ప్రోత్సాహకం**



ప్రోత్సాహకాలు అందుకున్న వలంటీర్లతో నాయకులు

పెనమలూరు: గంగూరు గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న 32 మంది వలంటీర్లు ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వ గుర్తింపు పొందినందుకు వలంటీర్లను గ్రామంలో బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. గ్రామానికి సేవా వజ్ర అవార్డు వడ్డాది నాగలక్ష్మి, చావా సునీతకు వచ్చింది. మిగతా 30 మంది వలంటీర్లకు కూడా ప్రతిభా పుసర్కారాలు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో గ్రామంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్బర్‌పాషా వలంటీర్లను ప్రోత్సహించటానికి నగదు అందచేశారు. సేవావజ్ర వచ్చిన ఇద్దరికి తలా రూ.2 వేల చొప్పున, మిగతా 30 మంది వలంటీర్లకు తలా రూ.వెయ్యి చొప్పున మొత్తం రూ.34 వేలు ప్రోత్సాహకం అందించారు. వలంటీర్లు భవిష్యత్తులో మరింత సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కంకిపాడు: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ పట్టాభి మెమోరియల్ గ్రామీణాభివృద్ధి సంస్థ ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళలకు టైలరింగ్, డీటీపీ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తుందని ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. టైలరింగ్, డీటీపీలో ఆసక్తి ఉన్న మహిళలు శిక్షణ పొంది స్వయం ఉపాధి సాధించాలన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి 30 రోజులు పాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మచిలీపట్నం కేంద్రంగా నిర్వహించే శిక్షణ తరగతుల్లో పాల్గొనదలచిన మహిళలు 6301905759, 8008996818 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

### దివ్యాంగుల సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శిగా ప్రేమ్‌సుధాకర్



పెనమలూరు:ఏపీజీఎస్‌డబ్ల్యూఎస్ దివ్యాంగుల ఉద్యోగ సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శిగా గంగూరు సచివాలయంలో పని చేస్తున్న వెల్ఫేర్ సెక్రెటరీ ప్రత్తిపాటి ప్రేమ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు ఆయన బుధవారం గంగూరులో వివరాలు తెలుపుతూ ఈ నెల 21వ తేదీన విజయవాడలో గ్రామ/వార్డు సచివాలయాలలో పని చేస్తున్న దివ్యాంగుల ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఎంపిక చేశారన్నారు. తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల ఉద్యోగుల పట్ల సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రేమాభిమానం చూపారన్నారు. దివ్యాంగులకు సంబంధించిన విధివిధానాలతో ప్రభుత్వం జీవో 26 ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా తమ సంఘం నుంచి సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.

# గంగూరులో షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం



గంగూరులో షాదిఖానా పనులు ప్రారంభిస్తున్న పీఆర్ఏఈ వెంకటేశ్వరరావు

పెనమలూరు: గంగూరు గ్రామస్తులు చిరుకాల కోరిక నెరవేరనుంది. గ్రామంలో ముస్లింల అవసరాలకు షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో షాదీఖానా నిర్మాణం చేయాలని గత దశాబ్దకాలంగా ఎదురు చూస్తున్నారు. గ్రామస్తుల సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి షాదీఖానా నిర్మాణానికి తొలిదశగా రూ.50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు బుధవారం పంచాయతీ రాజ్ ఏఈ వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అక్బర్‌పాషా ఆధ్వర్యంలో షాదీఖానా నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి పనులు ప్రారంభించారు. అక్బర్‌పాషా మాట్లాడుతూ ఎమ్మెల్యే సహకారంతో షాదిఖానా నిర్మాణం చేపట్టామని, మొత్తం రూ.కోటి వరకు ఖర్చు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యం



కంకిపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది

కంకిపాడు: పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి కర్తవ్యమని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు అన్నారు. కంకిపాడులో మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. బ్యాంకు కాలనీ వీధుల్లో ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేస్తూ ప్లకార్డులను ప్రదర్శించారు. బాకీ బాబు మాట్లాడుతూ రోజు రోజుకీ పర్యావరణం కలుషితంగా మారుతుందని తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. కాలుష్య నివారణకు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, సిహెచ్‌సి ఛైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, అగ్రిబోర్డు డైరెక్టర్ జొన్నలగడ్డ నాగేశ్వరరావు, నాయకులు వంకదారు చిట్టిబ్బాయ్, బాకీ రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు జాబ్ మేళా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 గురువారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ మేనేజర్ సీహెచ్ మోహన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాలో హెట్రో, అరబిందో, బుక్ ఎక్స్‌పర్ట్, ఇన్ఫోక్యూరిస్, యాక్సిస్ బ్యాంక్ , టీఎం లీజ్, జియో, కాలిబర్ వంటి 12 కంపెనీలలో 500లకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ, డిప్లమో చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. రూ.10వేలు నుంచి 20వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9676955667, 7842503456, 96522861315 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# అందరి సమన్వయంతోనే ప్రగతి



అంతర్గత రహదారుల పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రజాప్రతినిధులు

కంకిపాడు: అందరి సమన్వయంతోనే ప్రగతి సాధ్యమని వక్తలు తెలిపారు. పంచాయతీ నిధులు రూ.14 లక్షలు అంచనా వ్యయంతో చేపట్టిన అంతర్గత రహదారి అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. జెడ్పీటీసీ బాకీ బాబు మాట్లాడుతూ ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను సమర్థంగా వినియోగించాలని, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, వైస్ ఎంపీపీ ధూళిపూడి కృష్ణకిషోర్, సిహెచ్‌సి ఛైర్మన్ మేదంద్రావు కుటుంబరావు, మాజీ సర్పంచ్ బండి నాంచారయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# మానికొండ సూర్యావతి సేవలు చిరస్మరణీయం



ఉంగుటూరు సీపీఎం కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న వంశీ

ఉంగుటూరు: మానికొండ సూర్యావతి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అన్నారు. ఉంగుటూరులో కామ్రేడ్ మానికొండ సూర్యావతి శ్రామిక భవనం నిర్మాణ పనులను సీపీఎం నాయకులతో కలసి ఎమ్మెల్యే వంశీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూర్యావతి నిత్యం ప్రజా సమస్యలపై అనేక ఉద్యమాలు చేశారన్నారు. ఆమె ఎమ్మెల్సీగా, ఉంగుటూరు మండల పరిషత్ ప్రథమ ఎంపీపీగా, నందమూరు గ్రామ సర్పంచ్‌గా అనేక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. సూర్యావతి పేరుతో సీపీఎం కార్యాలయం ఏర్పాటులో తాను పాలు పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నాగేశ్వరరావు, మాజీ కార్యదర్శి ఆర్.రఘు, జిల్లా నాయకులు టీవీ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.

### మృతుడి పిల్లల పేరిట రూ.5.50 లక్షల డిపాజిట్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ బిల్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు గుంటూరు జిల్లా పెనుమాక గ్రామ వాసి మేమవరపు భరత్ (జాన్సన్ టైల్స్ ఎంప్లాయి) ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. ఐదేళ్లు, మూడేళ్ల వయసున్న ఆయన ఇద్దరు పిల్లల భవిష్యత్ నిమిత్తం అసోసియేషన్ తరపున రూ.5.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన పత్రాలను బుధవారం సంఘం రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ ముజీబ్ చేతుల మీదుగా నగరంలోని సంఘ కార్యాలయంలో భరత్ కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి పాలడుగు ప్రభాకర్, కోస్తాంధ్ర అధ్యక్షుడు కేఎస్ఎన్ రాజు, సభ్యులు జీఎస్‌వీ కిషోర్, కొల్లూరి అశోక్, బాలకృష్ణ, జస్వంత్, అమర్నాథ్, లక్ష్మీకాంత్ సాయినాథ్ హనుమంతప్ప పాల్గొన్నారు.

# గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపుదల



కంకిపాడు శాఖా గ్రంథాలయంలో కథల పుస్తకాలను చదువుతున్న విద్యార్థులు



కంకిపాడు: గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపొందుతుందని కంకిపాడు గ్రంథాలయాధికారి సిహెచ్ రామకృష్ణ అన్నారు. వేసవి శిక్షణా కార్యక్రమాలు స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం కొనసాగాయి. కథల పుస్తకాలు చదవటం, నీతి తెలియజెప్పటంపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి రామకృష్ణ మాట్లాడుతూ గ్రంథాలయాల్లో ఉన్న విలువైన పుస్తక బాంఢాగారాన్ని విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. పోటీ ప్రపంచంలో తలపడేందుకు అవసరమైన అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

**పుస్తక పఠనంతో మేధో వికాసం**

గన్నవరంరూరల్: పుస్తక పఠనంతో విద్యార్థుల మేధో సంపత్తి పెరుగుతుందని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి అన్నా రు. స్థానిక గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, కథలు చెప్పించటం, చెస్ వంటి ఆటలు ఆడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.









## జలక్రీడల్లో శిక్షణ

విజయవాడ పున్నమి ఘాట్ సమీపంలో చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఈ సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో సూమారు 50 మంది పైగా పాల్గొన్నారు. కయాకింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్న చిత్రాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

# సీనియర్ న్యాయవాది లింగంనేని రాజారావు మృతి



లింగంనేని రాజారావు (ఫైల్)

హనుమాన్‌జంక్షన్‌రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, నోటరీ లింగంనేని రాజారావు (65) మృతి చెందారు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న ఆయన విజయవాడలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నూజివీడు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా, హనుమాన్‌జంక్షన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా, ఆశాజ్యోతి వికలాంగుల వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్‌గా, సరోజిని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్‌గా లింగంనేని రాజారావు విశేష సేవలు అందించారు. ప్రస్తుతం బాపులపాడు గ్రామ పంచాయతీ ఐదవ వార్డు సభ్యుడిగా ఉన్నారు. సీనియర్ న్యాయవాదిగా హనుమాన్‌జంక్షన్ ప్రాంతంలో ఆయన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. పలు జాతీయ బ్యాంకులకు రాజారావు న్యాయ సలహాదారునిగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతికి వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు, లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ పుట్టగుంట సతీష్ కుమార్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ బొడ్డేపల్లి నరేష్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. పలువురు పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామమైన బాపులపాడు మండలం వీరవల్లిలో గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

# యువకుడి ఆత్మహత్యాయత్నం

కాపాడిన కృష్ణలంక పోలీసులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆత్మహత్యాయత్నం చేసిన ఓ యువకుడిని కృష్ణలంక పోలీసులు రక్షించారు. సేకరించిన వివరాల మేరకు మన్యం జిల్లా పార్వతీపురంమండలంలోని సాలూరుకు చెందిన ఎం.ఎ.ఎల్.ప్రసాద్ నగరంలో ఉంటూ నాగార్జున యూనివర్సిటీలో డిగ్రీ చదువుతున్నాడు. చదువు కొనసాగించడం ఇష్టంలేని ప్రసాద్ తల్లిదండ్రుల ఒత్తిడితో చదువుతున్నాడు. తీవ్ర మనస్తాపానికి గురై మంగళవారం రాత్రి రైల్వే బ్రిడ్జి పై నుంచి కృష్ణా నదిలోకి దూకేందుకు యత్నించాడు. సమాచారం అందుకున్న సీఐ ఎం.వి.దుర్గారావు వెంటనే అప్రమత్తమై కానిస్టేబుల్ రాములు, ఇతర సిబ్బందిని ఘటనా స్థలానికి పంపించి యువకుడిని రక్షించారు. స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చి యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు.

# ఆర్టీసీలో పెరిగిన ఉద్యోగ భద్రత



చంద్రశేఖర్‌రెడ్డికి సన్మానం చేస్తున్న నేతలు

పెనమలూరు: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తరువాత ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లభించిందని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు అన్నారు. యూనియన్ 27వ రాష్ట్ర మహాసభలు పోరంకి మురళీ రిసార్ట్స్‌లో బుధవారం నిర్వహించారు. పెనమలూరులోని వైవీరావు సభాప్రాంగణం, బి.రామారావు సభావేదికపై జరిగిన సమావేశంలో దామోదరరావు మాట్లాడారు. ఎండీ ద్వారకా తిరుమలరావు చొరవతో 2,096 మంది ఉద్యోగుల ప్రమోషన్లకు ప్రభుత్వం అనుమతించిందని తెలిపారు. పీఆర్‌సీ నెలలోనే అమలవుతుందన్నారు. పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవులు, ఉద్యోగుల నైట్‌అవుట్ అలవెన్సులు జీతంలో కలిపి ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంక్షేమ ప్రభుత్వ సలహాదారుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి మట్లాడుతూ.. ఆర్టీసీనీ ప్రభుత్వంలో విలీనం చేస్తానని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నారని చెప్పారు. ప్రజారవాణాలో ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

**నూతన కమిటీ ఎన్నిక..**

ఎంప్లాయీస్ యూనియన్ నూతన కమిటీ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర అధ్యక్షుడిగా పలిశెట్టి దామోదరరా వు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి.సుబ్రహ్మణ్యం, ఛీఫ్ వైస్ ప్రెసిడెంట్లుగా షేక్.సుభాని, కె.నాగేశ్వరరావు, ప్రధా న కార్యదర్శిగా జీవీ.నరసయ్య, డిప్యూటీ జనరల్ సెక్రటరీగా ఎ.ప్రభాకర్‌యాదవ్, జి.నారాయణరావు, ఎండీ.ప్రసాద్, కార్యవర్గ సభ్యులు ఎంపికయ్యారు.